క్లుప్తంగా

నేడు మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రానికి రైతులు తమ పంటను తీసుకురావాలని సూచించారు.

ఉద్యోగుల కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

కుంటాల: మండలంలోని కల్లూరులో ఉద్యోగుల సంఘం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండలాధ్యక్షుడిగా వాటోలి ముత్యం, ప్రధాన కార్యదర్శిగా సంధ్య, కోశాధికారిగా సాయన్న, తదితరులు ఎన్నుకున్నారు. నిరుద్యోగులకు, ఉద్యోగులకు సహాయ, సహకారం అందిస్తామని కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం ఇటీవల సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన సోని, నిక్షిత, ప్రఫుల్‌ను ఘనంగా సన్మానించారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

సోన్: దసరా పండుగ సందర్భంగా మండలంలోని న్యూబొప్పారం పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్మల్‌వాసి సామల వేణుగోపాల్‌రెడ్డి నలుగురు పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకాయి హరితరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, ఆకారం సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'రాజీనామా చేయలేదు.. ఎమ్మెల్యే వెంట నడుస్తా'

భైంసారూరల్: పీఏసీఎస్ వైస్ చైర్మన్ పదవికి తాను రాజీనామా చేయలేదని చాకెటి లస్మన్న వెల్లడించారు. మంగళవారం మండలంలోని తిమ్మాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. తాను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అడుగుజాడల్లోనే నడుస్తానని పేర్కొన్నారు. కొందరు అసమ్మతినేతలు పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వదంతులు వ్యాప్తి చేశారని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు భూమారెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తీజ్ ఉత్సవాలు



జగదాంబ ఆలయం వద్ద యువతులు

లోకేశ్వరం: మండలంలోని నగర్‌తండాలో మంగళవారం తీజ్ ఉత్సవాలు నిర్వహించా రు. ఈసందర్భంగా సర్పంచ్ యశోదబాయి మాట్లాడుతూ తండాలోని పెళ్లికాని యువతులు తొమ్మిది రోజులపాటు నియమ నిష్టలతో ఉపవాసం ఉండి జగదాంబ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వేడుకల్లో గంగారాం, నగేశ్, గణేశ్, బలరాం, ఫకీర్, కిషన్, ప్రకాశ్ ఉన్నారు.

ఎల్లమ్మ జాతర



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఏటా దసరా పండుగ రోజు ఎల్లమ్మ జాతర నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు. ఈజాతరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా వివిధ దుకాణాలు ఏర్పాటు చేయగా.. భక్తులకు ఇబ్బందులు కలగకుండా గ్రామస్తులు, పోలీసులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో ఐపీఎల్ తరహాలో నిర్వహించిన కేపీఎల్ క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఇందులో ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో కల్లూర్ చాలెంజర్ జట్టు(గట్టుపల్లి నవీన్), కల్లూర్ రైడర్(గుద్దేటి పరశురాం) జట్లు తలపడగా కల్లూర్ చాలెంజర్స్ జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్లకు నిర్వాహకులు కప్పుతోపాటు షీల్డ్ అందజేశారు. ఉద్యోగులు, యువకులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో శివాలయం, పెద్దమ్మ, ఎల్లమ్మ, హనుమాన్ ఆలయాలకు మంత్రి ఐకేరెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సహకారంతో మంత్రి పీఏ నాలం శ్రీనివాస్ రూ.కోటి నిధులు మంజూరు చేయించారు. ఈసందర్భంగా ఆయనను పలువురు గ్రామస్తులు సన్మానించారు.

ఘనంగా దసరా వేడుకలు



భైంసా పట్టణంలో వేడుక తిలకిస్తున్న జనం



కుభీర్‌లో జమ్మి చెట్టు వద్ద పూజలు చేస్తున్న ప్రజలు

భైంసాటౌన్: పట్టణంలో మంగళవారం దసరా పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జమ్మిచెట్టుకు పూజ అనంతరం బంధువులు, స్నేహితులు ఒకరికొకరు జమ్మి(బంగారం) ఆకు ఇచ్చిపుచ్చుకున్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆయుధ పూజ నిర్వహించగా సీఐ ఎల్.శ్రీను, ఎస్సైలు పాల్గొన్నారు. బాగుబాయి గుట్ట వద్ద సాయిబాబా ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో రావణాసురుడి ప్రతిమను దహనం చేయగా భక్తులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద/తానూరు: మండలంలోని గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వాహన పూజ చేసిన మంత్రి 'అల్లోల'

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి వాహన పూజ చేశారు. జిల్లా ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని కోరుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు. గౌతమ్‌రెడ్డి, దివ్యారెడ్డి, మురళీధర్‌రెడ్డి ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో దసరా వేడుకలను జరుపుకొన్నారు. భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో దుర్గామాత చిత్రపటం వద్ద ఎస్సై శ్రీకాంత్, పోలీసులు పూజలు చేశారు.

కుంటాల: మండలంలోని ఓలా ఎల్లమ్మ ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై హన్మాండ్లు ఆయుధపూజ చేశారు.

కుభీర్: మండలకేంద్రంలో సోమవారం దసరా పండుగ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు బోనం ఎత్తుకొని ఎల్లమ్మ మందిరానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి మహాలక్ష్మి ఆలయ ఆవరణలో జమ్మిచెట్టుకు పూజలు చేశారు. దార్‌కుభీర్, చొండి, సాంవ్లి, పార్డి(కె), దార్‌కుభీర్ తదితర గ్రామాల్లో వేడుకలు ఉత్సాహంగా జరుపుకొన్నారు.



ఆయుధపూజలో ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్



వాహన పూజ చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



కుంటాలలో పూజ చేస్తున్న ఎస్సై హన్మాండ్లు



లక్ష్మణచాంద: పూజకు వెళ్తున్న మునిపెల్లి ప్రజలు



భైంసారూరల్ స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్ పూజలు

అంబరాన్నంటిన సంబరం



ఖానాపూర్‌లో రావణాసురుడి దహన కార్యక్రమాన్ని తిలకించేందుకు వచ్చిన జనం

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో దసరా పండుగ ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం రాత్రి హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రావణాసురుడి వధ కార్యక్రమం ఆకట్టుకుంది. అంతకు ముందు హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ఎం.సురేశ్ ధ్వజారోహణ చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించగా.. ప్రజలు తరలివచ్చి వీక్షించారు. ఆయా కార్యక్రమాల్లో వక్త ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ కార్యవాహ రాజులవార్ దిగంబర్, ఎమ్మెల్యే రేఖానాయక్, మున్సిపల్ చైర్మన్ రాజేందర్, హిందూ ఉత్సవ సమితి వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర..

శివాజీనగర్‌లోని మహాలక్ష్మి ఆలయం నుంచి దుర్గామాత ప్రతిమను హిందూ ఉత్సవ సమితి నాయకులు శోభాయాత్రగా కళాశాల మైదానం వరకు తీసుకొచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఖానాపూర్ సీఐ మోహన్, ఎస్సై లింబాద్రి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు. అంతకుముందు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు ఆయుధపూజ చేశారు.



ఎమ్మెల్యేను ఆశీర్వదిస్తున్న చిన్నారులు

చిన్నారులకు వాయినం

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎమ్మెల్యే రేఖానాయక్ చిన్నారులకు వాయినం ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. పట్టణంలోని తన నివాసంలో పదేళ్లలోపున్న చిన్నారులకు పండ్లు, ఫలాలు, దక్షిణ తాంబులాలు ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి నిమజ్జనం



భైంసాలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



సోన్: కద్గాల్‌లో నిమజ్జనం చేస్తున్న భక్తులు

సోన్: మండల కేంద్రంతోపాటు కద్గాల్, న్యూవెల్మల్, బొప్పారం, సాకెర, సిద్దులకుంట, పాక్‌పట్ల గ్రామాల్లో దుర్గాదేవి శోభాయాత్ర కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిదిరోజుల పూజల అనంతరం అమ్మవారి ప్రతిమలను నిమజ్జనం చేశారు. దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, ధర్మోరా, కన్కపూర్, రాయపూర్‌కాండ్లీ, లోకేశ్వరం, అబ్దుల్లాపూర్, భాగాపూర్, మన్మద్, గడ్‌చాంద గ్రామాల్లో సోమ,మంగళవారం దుర్గామాత నిమజ్జనం చేశారు. గోదావరి తీరంలోని బ్రహ్మేశ్వరాలయం, పంచగుడిలోని వంతెన వద్ద నిమజ్జనం చేశారు.

కుభీర్: మండల కేంద్రంతోపాటు బెల్గాం, పార్డి(కె) తదితర గ్రామాల్లో దుర్గాదేవి నిమజ్జనం నిర్వహించారు. అంతకుముందు వీధుల్లో శోభాయాత్ర నిర్వహించగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పీచర, పార్‌పెల్లి, పొట్టపెల్లి, వడ్యాల్, లక్ష్మణచాంద తదితర గ్రామాల్లో అమ్మవారి నిమజ్జనం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం శోభాయాత్ర నిర్వహించగా యువకులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.



లోకేశ్వరం: కన్కపూర్‌లో శోభాయాత్రలో భక్తులు

ఆలయంలో హోమం

భైంసా: పట్టణంలో మండపాల వద్ద అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భట్టిగల్లిలో జైమాతాది యూత్ ఆధ్వర్యంలో హోమం చేశారు.

తానూరు: మండలకేంద్రంతోపాటు ఉమ్రి(కే)లో సోమవారం దుర్గాదేవి మండపాల వద్ద భక్తులు హోమం నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆయా గ్రామాల్లో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హిమాలయాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్త



ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన సుద్దాల మహిపాల్ అనే బీఆర్‌ఎస్ కార్యకర్త ఉత్తరాఖండ్‌లోని హిమాలయాల వద్ద తన అభిమానం చాటుకున్నాడు. ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్‌తో కూడిన బీఆర్‌ఎస్ ఫ్లెక్సీ ప్రదర్శించారు. ఆరురోజుల యాత్రలో భాగంగా ఈ ప్రదర్శన చేసినట్లు మహిపాల్ పేర్కొన్నాడు.

బతుకమ్మా.. వెళ్లి రావమ్మా..



బావాపూర్(కే)లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దిలావర్‌పూర్‌లో బతుకమ్మ పేరుస్తున్న మహిళలు

ఖానాపూర్: మండలంలోని కొత్తపేట్, బావాపూర్(కే)తో పాటు పలు గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళలు తీరొక్కపూలతో బతుకమ్మలు పేర్చి ప్రధాన కూడళ్ల వద్ద ఉంచి ఆడిపాడారు. అనంతరం కాలువల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో బీర్ల లక్ష్మి, నర్సయ్య, దాసరిగొండ మల్లయ్య, కాశవేని సునీత, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల్లో మంగళవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఆలయం వద్ద పూజలు చేసి ఆడిపాడారు. ఎల్లమ్మ ఆలయ కోనేటిలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



కడెం: కొండుకూర్‌లో

కడెం: మండలంలోని కొండుకూర్‌లో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామానికి చెందిన సంద వసంత-రామచంద్రం శివలింగం ఆకృతిలో పేర్చిన బతుకమ్మ ఆకర్షణగా నిలిచింది.

అంబేద్కర్ మార్గం అనుసరణీయం

- ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి
- గ్రామాల్లో ధమ్మచక్ర పరివర్తన్ దివస్



భైంసాలో మాట్లాడుతున్న ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: అంబేద్కర్ చూపిన మార్గం ప్రతి ఒక్కరికి అనుసరణీయమని ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పవార్ రామారావుపటేల్ అన్నారు. ధమ్మచక్ర పరివర్తన్ దివస్ పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని బస్టాండ్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో దళిత సంఘం, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు సాయిలు, భీంరావు డోంగ్రే, శంకర్ చంద్రే, గౌతం పింగ్లే తదితరులున్నారు.

పట్టణంలో ర్యాలీ..

పట్టణంలో మంగళవారం ధమ్మచక్ర పరివర్తన్ దివస్ ఘనంగా జరుపుకొన్నారు. సిద్ధార్థనగర్, రాహుల్‌నగర్, పులేనగర్, పిప్రికాలనీ, అంబేద్కర్‌నగర్, తదితర కాలనీల నుంచి బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలతో ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా యువత నృత్యాలు చేస్తూ బస్టాండ్ ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్, తిమ్మాపూర్, కుంబి, మిర్జాపూర్, టాక్లి, లింగా, కోతల్‌గాం తోపాటు ఆయా గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పంచరంగి జెండాలను ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాసర, ముధోల్ మండలాల్లో..

భైంసా: బాసర, ముధోల్ మండలాల్లో మంగళవారం ధమ్మచక్ర పరివర్తన్ దివస్ నిర్వహించారు. ముధోల్ ఐబీ చౌరస్తాలో, తరోడ గ్రామంలో బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముధ్గల్‌లో ధమ్మచక్రపరివర్తన్ దివస్ జరుపుకొన్నారు. బాసర మండలం బిద్రెల్లిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.



కుంటాల: ఓలాలో సర్పంచ్ కనీస్ ఫాతిమా

కుంటాల: మండలంలోని ఓలా, వెంకూర్ గ్రామాల్లో మంగళవారం ధమ్మచక్ర పరివర్తన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, బుద్ధుడి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కనీస్ ఫాతిమా, మగ్గిడి శృతి, అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్, వీడీసీ చైర్మన్ మహేందర్, కరుణాకర్, జగదీశ్వర్, సుధాకర్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.



తానూరు: ఉమ్రి(కే)లో వందన కార్యక్రమంలో పాల్గొన్న భారతీయ బౌద్ధమహాసభ సభ్యులు

తానూరు: ధమ్మచక్ర పరివర్తన్ దివస్‌ను పురస్కరించుకొని మండలకేంద్రంతోపాటు ఉమ్రి(కే), దౌలతాబాద్, తానూరు, బెంబర, ఎల్వి గ్రామాల్లో బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ 1956 అక్టోబర్ 14న విజయదశమి రోజున అంబేద్కర్ నాగపూర్‌లో 50 వేల మందితో ధమ్మదీక్ష స్వీకరించారని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు కల్పించారని గుర్తు చేశారు. అనంతరం పంచరంగి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధమహాసభ నాయకులు గంగాధర్, ఆనంద్‌రావ్, సూర్యకాంత్ పవార్, భీమ్‌పవార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని జోహర్‌పూర్, హథ్‌గాం, లోకేశ్వరం, కన్కపూర్ గ్రామాల్లో ధమ్మచక్ర పరివర్తన్ దివస్ ఘనంగా జరుపుకొన్నారు. గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్ధుడి విగ్రహం వద్ద పూలమాలతో పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు దిగంబర్, భోజన్న, సాయన్న ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

భైంసారూరల్: మండలంలోని సిరాల శివాలయంలో జోడు శివలింగాలను సోమవారం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు సతీశ్, రాజు, దుప్పే గణేశ్, మాజీ జెడ్పీటీసీ సూర్యంరెడ్డి, కోఆప్షన్ సభ్యులు గజానంద్, మాణిక్‌రావు, నంగి రాజేశ్, సాయినాథ్, ముత్యంరెడ్డి, సాహెబ్‌రావు, పోతన్న, శ్రీనివాస్‌రెడ్డి, సచిన్, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భైంసా: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీనే గెలిపించాలని బాసర సర్పంచుల సంఘం మండలాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి ఓటర్లను కోరారు. మంగళవారం బాసర మండలం కిర్గుల్(బి) గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కు తరలివచ్చి విఠల్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కోర్వ శ్యామ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, నాయకులు జ్ఞానిపటేల్ పాల్గొన్నారు.



భైంసా: కిర్గుల్(బి)లో ప్రచారం చేస్తున్న నేతలు

అటెన్షన్ ప్లీజ్.. మరమ్మతులు చేపట్టండి



తానూరు: మండలంలోని ఇలేగాం నుంచి ఉమ్రి(కే) గ్రామానికి వెళ్లే మార్గంలో వంతెన వద్ద రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్ 91008 53883

ఎన్నికల బృందం పర్యటన



పొట్టపెల్లిలో పర్యటిస్తున్న బృందం సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి, లక్ష్మణచాంద, రాచాపూర్, వడ్యాల్, కనకాపూర్ తదితర గ్రామాల్లో ఎన్నికల పరిశీలకుల బృందం పర్యటించింది. ఈసందర్భంగా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పార్టీల జెండాలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రచారంలో ఎక్కువ సౌండ్‌తో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పురుషోత్తం, హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ జగదీశ్వర్, సాయేందర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.